
క్లుప్తంగా

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ



సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. స్వామివారికి ప్రీతికరమైన రోజు సోమవారం కావడం, ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారు జాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో తొలి అభిషేకం, పూజలు చేశారు. వాటిని తిలకించడానికి భక్తులు బారులు తీరారు. సాయంత్రం దేవతా మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. ట్రస్టు బోర్డు సభ్యులు, దేవదాయ శాఖ సిబ్బంది సేవలందించారు.

4న ముత్యాలమ్మ తల్లి జాతర



కొత్తపల్లి: స్థానిక ముత్యాలమ్మ తల్లి జాతర మహోత్సవాలను ఈ నెల 4వ తేదీన ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. అమ్మవారి గరగలను గ్రామంలో ఊరేగిస్తున్నామని, శుక్రవారం తీర్థాన్ని నిర్వహించనున్నామని చెప్పారు. ఉత్సవాల సందర్భంగా ఆలయానికి రంగులు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నామన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



వాకతిప్పలో చిన్నఅప్పన్న కుటుంబీకులకు సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం పరామర్శించారు. వాకతిప్పకు చెందిన ఇటీవల మృతి చెందిన మసకపల్లి చిన్నఅప్పన్న కుటుంబానికి రూ.5 వేలు, అనారోగ్యంతో బాధపడుతున్న కొత్త మూలపేటకు చెందిన కాటూరి నాగేశ్వరరావు, కాటూరి సూర్యప్రకాష్‌లకు రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని కోఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో వాకతిప్ప సర్పంచ్ పాలని దొరబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, దాకే రాజ్‌కుమార్, వడ్డీ నాగమణి, ఎంపీటీసీ సుగుణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి వ్యవసాయ కూలీ మృతి



మృతి చెందిన సత్యనారాయణ

పెద్దాపురం: పొలం పనులు ముగించుకుని ఇంటికి వస్తున్న వ్యవసాయ కూలీ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం రాత్రి పెద్దాపురం మండలం వడ్లమూరు- జి.రాగంపేట పంచాయతీల సరిహద్దు ప్రాంతంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వడ్లమూరు గ్రామానికి చెందిన దాడిశెట్టి సత్యనారాయణ (55) తన పొలం పనులు పూర్తి చేసుకుని ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో ఉన్న హైటెన్షన్ విద్యుత్తు తీగ తగులుకుని అక్కడికక్కడే మృతి చెందాడు. పొలానికి వెళ్లిన వ్యక్తి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూసేసరికి సత్యనారాయణ విగతజీవిగా పడి ఉన్నాడు. మృతుడికి భార్య, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. స్థానికుల సమాచారం మేరకు పెద్దాపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

విజ్ఞానదాయకంగా బర్న్స్ అవేర్‌నెస్ సీఎంఈ

కాకినాడ క్రైం: స్థానిక రంగరాయ వైద్య కళాశాలలో బర్న్స్ అవేర్‌నెస్, ప్రీవెన్షన్ అండ్ ట్రీట్మెంట్ సీఎంఈ (కంట్యునస్ మెడికల్ ఎడ్యుకేషన్) కార్యక్రమాన్ని విజ్ఞానదాయకంగా నిర్వహించారు. సోమవారం ఆర్ఎంసీకి చెందిన డిపార్టుమెంట్ ఆఫ్ ప్లాస్టిక్ సర్జరీ, నేషనల్ అకాడమీ ఆఫ్ బర్న్స్ ఇండియా (ఎన్ఏబీఐ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎన్ఏబీఐ ప్రెసిడెంట్ డాక్టర్ అనంత సిన్హా, హెచ్ఓడీ డాక్టర్ పి.లక్ష్మి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రత్నభూషణ్, సీనియర్ కన్సల్టెంట్, ప్లాస్టిక్ సర్జరీ వైద్య నిపుణుడు డాక్టర్ కె.విష్ణుమూర్తి పాల్గొన్న ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి హాజరైన వైద్యులకు ప్లాస్టిక్ సర్జరీలోని కీలక విషయాలపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ సర్జరీ వైద్య విభాగంలో చోటు చేసుకుంటున్న మార్పులను అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంతరం డాక్టర్ విష్ణుమూర్తి సహా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవిలను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కాకినాడ శాఖ తరపున సత్కరించారు. ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, పలువురు సర్జరీ విభాగ వైద్యులు పాల్గొన్నారు.

వానొచ్చే... ముంచేసే

- వల్లపు ప్రాంతాలు జలమయం
- తడిసి ముద్దయిన ధాన్యం రాశులు



ఉండూరులో ధాన్యం రాశులను పరిశీలిస్తున్న జేసీ ఇలక్కియ

సామర్లకోట: పగలు.. సెగలు అన్నట్టు గుబులు రేపిన భానుడు కాస్త విరామం ప్రకటించాడు. సోమవారం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురవడంతో ప్రజలు ఉపశమనం పొందారు. మే నెల మొదటి రోజునే వర్షం ఆగకుండా కురిసింది. ఇది ప్రజలకు ఊరట కలిగించింది. అయితే దాళ్వా వరి కోతల్లో ఉన్న రైతన్నలకు మాత్రం కష్టాలు తెచ్చిపెట్టింది. కోతలు కోసి రాశులుగా పోసిన సమయంలో వర్షం కురవడంతో ధాన్యం రాశులు తడిచి ముద్దయ్యాయి. సామర్లకోట రూరల్‌లో చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉంది. వర్షానికి సామర్లకోట బస్సు కాంప్లెక్స్‌తో పాటు జయలక్ష్మి థియేటర్ రోడ్డు, సత్యనారాయణపురం రోడ్డు, గణేష్ కాలనీ, భాస్కర్‌నగర్, సాయినగర్ రోడ్లు చెరువులను తలపించాయి. మండలంలో వీకే రాయపురంలో కొత్తూరు, గొంచాల, అచ్చంపేట, జి.కొత్తూరు గ్రామాల్లో పలు లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి.

ధాన్యం రంగు మారకుండా చూసుకోవాలి

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ధాన్యం రంగు మారకుండా రైతులు ఏర్పాట్లు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ సూచించారు. ఉండూరు, వేట్లపాలెంలలో పంట పొలాలు, ధాన్యం రాశులను ఆమె పరిశీలించారు. మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలన్నారు. ఇప్పటికే కోతలు పూర్తి చేసుకుని రాశులు ఏర్పాటు చేసుకున్న రైతులు వర్షపు నీరు బయటకు పోయే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు నష్టం లేకుండా ధాన్యం సేకరించాలని ప్రభుత్వం సూచించిందన్నారు. ఏఓ ఐ.సత్య మాట్లాడుతూ మండలంలో 22,142 ఎకరాల్లో వరి సాగు చేయగా 9,800 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయని వివరించారు. రెండు వేల ఎకరాలకు సంబంధించిన ధాన్యం రాశులు కళ్లాలపై ఉందన్నారు. కోతలు కోసి పనలపై ఉన్న ధాన్యం రంగు మారకుండా లీటరు నీటికి 20 గ్రాముల కళ్లు ఉప్పు కలుపుకొని పనలపై పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, ఆర్ఐ ఎం.రాజేష్, ఏఈఓ ఎంవీ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



చెరువులా మారిన సామర్లకోట జయలక్ష్మి థియేటర్ రోడ్డు



సామర్లకోట బస్సు కాంప్లెక్స్‌లోకి చేరిన వర్షపు నీరు

పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లు

సామర్లకోట: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి హుస్సేన్‌పురంలో మూడు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. పురాతన పెంకిటిళ్లు కావడంతో వర్షానికి తడిచి గోడలు, పైకప్పు కూలిపోయింది. ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉందని ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది స్పందించి యజమానులను అప్రమత్తం చేశారు. చల్లా వెంకటేశ్వరరావు, శ్రీను, ఉగ్గిన వెంకటేశ్వరరావులకు చెందిన ఇళ్లు వర్షాలకు దెబ్బతిన్నాయి.

అకాల వర్షాలతో హడలెత్తుతున్న రైతులు

కొత్తపల్లి: అల్పపీడన ద్రోణితో కురుస్తున్న అకాల వర్షాలతో అన్నదాతలు హడలెత్తుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించుకున్న పంటను కాపాడుకునేందుకు నానాపాట్లు పడుతున్నారు. రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో చేతికొచ్చిన పంటను కాపాడుకోవడానికి ధాన్యాన్ని రాశులుగా చేసుకుని బరకాలతో కప్పుకుంటున్నారు.

జోరు వానలోనూ పింఛన్ల పంపిణీ



వర్షాన్ని లెక్కజేయకుండా పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ రొంగల వీరబాబు తదితరులు

కొత్తపల్లి: మండలంలో సోమవారం తెల్లవారు జాము నుంచి భారీ వర్షం కురిసింది. అయినా సరే తొలిరోజే పింఛన్లను అందజేయాలన్న సంకల్పంతో జోరు వానను సైతం లెక్క చేయకుండా వలంటీర్లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. పింఛను సొమ్ము కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు వలంటీర్ల నిబద్ధత చూసి ఆనందం వ్యక్తం చేశారు. మండల వ్యాప్తంగా తొలిరోజే సుమారు 90 శాతం మేర పింఛన్లను పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ అబ్రహాంలింకన్ తెలిపారు.

కాకినాడ వెళ్లి.. పింఛను అందజేసి

సామర్లకోట: ఒకటో తేదీ కావడంతో సోమవారం వేకువజాము నుంచే వర్షంలోనూ చాలామంది వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేశారు. ఇంటి తలుపు తట్టి అర్హులకు సొమ్ము అందజేశారు. సామర్లకోట మున్సిపాలిటీ 5వ సచివాలయానికి చెందిన పింఛన్‌దారు కిలపర్తి రాము అనారోగ్యంతో కాకినాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇది తెలుసుకున్న వలంటీర్ మసకపల్లి రవి అక్కడకు వెళ్లి పింఛను సొమ్ము అందజేశాడు. ఆస్పత్రికి వచ్చిన సమయంలో చేతిలో చిల్లుగవ్వ లేదని బాధపడుతున్న తరుణంలో ఆపద్బాంధవులా వలంటీర్ వచ్చాడని అభినందించారు.



కాకినాడలోని ఓ ఆస్పత్రిలో పింఛను అందజేస్తున్న వలంటీర్ రవి

రైలు దహనం కేసు కొట్టివేతతో సంబరాలు



చేబ్రోలులో సంబరాలు జరుపుకొంటున్న కాపు నేతలు

పిఠాపురం: విజయవాడ రైల్వే కోర్టు తుని రైలు దహనం కేసును కొట్టి వేయడంతో పిఠాపురం నియోజకవర్గంలో కాపు సంఘం నేతలు సోమవారం సంబరాలు చేసుకున్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో కాపు నేత ఓరుగంటి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో కాపు నేతలను అణగదొక్కడానికి తప్పుడు కేసులు బనాయించి జైలు పాలు చేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం కాపులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయించడానికి అందించిన సహకారాన్ని మరవలేమన్నారు. తమపై పెట్టిన తప్పుడు కేసులు మాఫీ చేయించడంలో కృషి చేసిన ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఎంపీ వంగా గీతలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాపు యువత నాయకులు ఓరుగంటి ప్రసాదరావు, ఎల్.సత్యనారాయణ, తుమ్మలపల్లి ఈశ్వరరావు, శివలింక తాతారావు తదితరులు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.సుభాషిణి

పిఠాపురం: కళాశాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికల ద్వారా చర్యలు తీసుకుంటున్నట్లు పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుభాషిణి తెలిపారు. పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన కళాశాల అభివృద్ధి కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. పెరుగుతున్న విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కళాశాలలో బాదం మాధవరావు ట్రస్టు ద్వారా ఒక ఇన్వర్టర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ట్రస్టు సభ్యులు ఉదయ చంద్రప్రకాష్ ప్రకటించారు. కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు కొండేపూడి శంకర్రావు, రామచంద్ర ప్రభు, కేవీఎస్ఎస్ ప్రసాద్, డాక్టర్ పి.రాజేష్, కళాశాల అధ్యాపకులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.సుభాషిణి

వివాహిత అదృశ్యం

సామర్లకోట: స్థానిక అమ్మాణమ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న సత్తి దుర్గాభవాని (24) అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. గత నెల 29వ తేదీ రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె ఆదివారం రాత్రి వరకూ రాలేదని భర్త శివారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

7న ఆర్యవైశ్యుల ఆత్మీయ సభ

కాకినాడ సిటీ: రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో 7న ఏపీఐఐసీ మాజీ అధ్యక్షుడు శ్రీకాకోళపు శివరామ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఉభయ గోదావరి జిల్లాల ఆర్యవైశ్యుల ఆత్మీయ సభ జరుగుతుందని నగర ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధి పెద్ది రత్నాజీ తెలిపారు. సోమవారం స్థానిక వైఎంవీ హాలులో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు లింగమల్లు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రత్నాజీ మాట్లాడుతూ ఆ సమావేశంలో ఆర్యవైశ్యుల అభివృద్ధి, ఐక్యత కోసం చర్చించి నిర్ణయాలు తీసుకుంటామన్నారు. తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య పేరుపై స్మృతి వనం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరతామన్నారు. సీఎం జగన్ ప్రభుత్వంలో ఆర్యవైశ్యుల సత్రాలను తమ కులం వారే నిర్వహించుకోవడానికి జీవో ఇచ్చారన్నారు. స్వర్గీయ పొట్టి శ్రీరాములు జయంతిని ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించడం, చింతామణి నాటక ప్రదర్శనలు జరగకుండా నిలిపివేయడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు కాకినాడ సిటీ, రూరల్ ప్రాంతాల్లో దేవాలయాలు, మార్కెటింగ్ కమిటీల్లో తమ కులానికి సముచిత స్థానం కల్పించినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఆర్యవైశ్య ప్రముఖులు కంతేటి కాశీ, వెత్సా ఆనంద్, కూసుమంచి పాపారావు, సామా రమేష్, కాకరపర్తి హరనాథ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నగర ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధి పెద్ది రత్నాజీ

కదిలిన కార్మిక లోకం

వాడవాడలా మేడే వేడుకలు

పెద్దాపురం: కార్మిక లోకం కదిలి వచ్చింది.. మేడే వేడుకలను అట్టహాసంగా నిర్వహించింది. కార్మిక దినోత్సవాన్ని పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో సోమవారం నిర్వహించారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనం వద్ద సీఐటీయూ నాయకుడు పెదిరెడ్డి విష్ణు, మున్సిపల్ సెంటర్‌లో మున్సిపల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకుడు వడ్రే గిరిబాబుతో పాటు ఆయా ప్రజా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మిక పతాకాలు ఆవిష్కరించారు. పలుచోట్ల జరిగిన కార్యక్రమాల్లో సీపీఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు, కేదారి నాగు, మాగాపు నాగు, దాడి బేబీ, డి.కాంత్రి కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో పులిమేరు, ఆనూరు గ్రామాల్లో మే డే వేడుకలు నిర్వహించారు. సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు.

సామర్లకోట: స్థానికంగా సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. బళ్ల మార్కెట్ సెంటర్ వద్ద జెండా ఎగురవేసి పాత తహసీల్దార్ కార్యాలయం నుంచి కమ్యూనిస్టు పార్టీ మృతవీరుల స్థూపం వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. నాయకులు ఎలిశెట్టి రామదాసు, ఉప్పలపాటి చంద్రయ్యదాసు, పెదిరెడ్ల సత్యనారాయణ పాల్గొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మెహర్ కాంప్లెక్స్ నుంచి ర్యాలీ జరిగింది. ఇందులో వివిధ వేషధారణలు ఆకట్టుకున్నాయి. అనంతరం జరిగిన సభలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలం శ్రీనివాసు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్మికులను దోచుకుంటుందన్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కరణం ప్రసాదరావు, సీఐటీయూ నాయకులు విప్పర్తి కొండలరావు, టి.నాగమణి పాల్గొన్నారు. ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో, మున్సిపల్ అవుట్ సోర్సింగ్ యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు.

ఘనంగా కార్మిక దినోత్సవం

కొత్తపల్లి: మండల పరిధిలో సోమవారం కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మండల సీపీఎం నాయకుడు గురాల అప్పారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు కనీస వేతనాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

పిఠాపురంలో..

పిఠాపురం: పిఠాపురం నియోజకవర్గంలో మేడే వేడుకల్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పిఠాపురంలో సీపీఎం కార్యాలయం, సీఐటీయూ కార్యాలయం, భవన నిర్మాణ కార్మికుల కార్యాలయాల్లో ఎర్ర జెండాలను ఆవిష్కరించారు. గొల్లప్రోలులో భారత కార్మిక సంఘాల సమాఖ్య నాయకుడు డి.నారాయణమూర్తి ఆధ్వర్యంలో మేడే జెండాను ఆవిష్కరించారు.



పులిమేరు మేడే వేడుకల్లో రైతు కూలీలు



సామర్లకోటలో సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ

వినాయకుని ఆలయంలో పూజలు

కాకినాడ సిటీ: స్థానిక స్వర్ణాంధ్ర కాలనీలో 12వ డివిజన్ వైఎస్సార్ సీపీ కన్వీనర్ జితేందర్ సింగ్ అండ్ బ్రదర్స్, స్థానిక పెద్దల సహకారంతో సిద్ధి వినాయకస్వామి ఆలయం నిర్మించారు. ఈ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవానికి ముందుగా టీటీడీ వేద పండితుడు హోతా శివభాస్కర్ శర్మ ఆధ్వర్యంలో హోమ పూజలు ప్రారంభించారు. ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎంపీ వంగా గీత, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్నలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జితేందర్‌సింగ్ వివరించారు. కార్యక్రమంలో భీమ్‌సింగ్, మంగళసింగ్, హబీబ్, సూరిబాబు, వాసు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి కల్యాణం

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలో వేణుగోపాలస్వామి ఆలయం వద్ద స్వామివారి కల్యాణ మహోత్సవం సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. స్వామివారికి ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.



వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నేటి నుంచి వేసవి శిక్షణ తరగతులు

కాకినాడ కల్చరల్: స్థానిక గాంధీనగర్‌లో చిల్డ్రన్స్ పార్కు ఆవరణలోని బాలభవన్‌లో ఈ నెల 2 నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు బాలభవన్ పర్యవేక్షకురాలు ఎ.శారద తెలిపారు. రోజూ ఉదయం 7.30 నుంచి 10.30 వరకూ, సాయంత్రం 4.30 నుంచి 7.30 గంటల వరకూ గాత్ర, వయోలిన్, మృదంగం, కరాటేలలో శిక్షణ ఉంటుందన్నారు. నగరంతో పాటు గ్రామీణ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 95500 07974 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

శ్రీవిశ్వకర్మ చరిత్ర పుస్తకావిష్కరణ



శ్రీవిశ్వకర్మ చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

కాకినాడ కల్చరల్: స్థానిక గాంధీనగర్ విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో రచయిత ర్యాలీ ప్రసాద్ రచించిన శ్రీవిశ్వకర్మ చరిత్ర పుస్తకావిష్కరణ సభ సోమవారం జరిగింది. శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామికి తాను రచించిన పుస్తకం అంకితం చేస్తున్నట్లు ప్రసాద్ తెలిపారు. విశ్వకర్మ ఒక సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కాదని, సృష్టి ఆవిర్భావానికి సంబంధించిన మహానుభావుడని అన్నారు. సంఘ అధ్యక్షులు తామరపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చె(చి)త్త శుద్ధికి సలాం

- కార్మికుల ఆరోగ్య భద్రతకు శ్రీకారం
- ప్రత్యేక కార్యాచరణ దిశగా చర్యలు
- నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తొలి అడుగు



చెత్తను సేకరించే పనుల్లో పారిశుధ్య కార్మికులు

కాకినాడ: ఆరోగ్యమే మహాభాగ్యం అంటుంటారు పెద్దలు.. అలాంటి ఆరోగ్య పరిరక్షణలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎనలేనిది.. రోడ్లు ఊడ్చి.. డ్రైనేజీలు శుభ్రం చేసి.. ఇళ్లకు వెళ్లి చెత్తను సేకరిస్తూ ప్రజారోగ్య పరిరక్షణలో వారే కీలక భూమిక పోషిస్తున్నారు.. 'చెత్త' పనితో ఆరోగ్యాలు ఫణంగా పెట్టి ప్రజారోగ్యానికి బాటలు వేస్తున్నారు. విశేష సేవలు అందిస్తున్న పారిశుధ్య కార్మికుల సంరక్షణకు కాకినాడ నగరపాలక సంస్థ ఓ అడుగు ముందుకు వేసింది. కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల 'మీ ఆరోగ్యం- మా బాధ్యత' అంటూ వీరి కోసం ఓ ప్రత్యేక కార్యచరణకు సిద్ధమయ్యారు. నగరం సుమారు 32 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంది. సుమారు 4 లక్షల జనాభా నివసిస్తున్నారు. నగరపాలక సంస్థ పరిధిలో 1,200 మంది రెగ్యులర్, ఔట్ సోర్సింగ్ విధానంలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరంతా నిత్యం వారికి కేటాయించిన విభాగాల్లో పారిశుధ్య సేవలు అందిస్తున్నారు. ఆసుపత్రుల వ్యర్థాలు, డ్రైనేజీలను శుభ్రం చేయడం, రోడ్లను ఊడ్చడం దగ్గర నుంచి మరెన్నో వ్యర్థాలను సేకరించే క్రమంలో కేన్సర్ వంటి ఆరోగ్య సమస్యలు, చర్మ వ్యాధులకు గురవుతున్నారు. అడపా దడపా వారికి వైద్య శిబిరాలు నిర్వహించడం మినహా ఇంత కాలం కార్మికుల ఆరోగ్య పరిరక్షణపై దృష్టి సారించే వారే కరవయ్యారు. ఈ పరిస్థితిలో కమిషనర్‌గా వచ్చిన ఐఏఎస్ అధికారి డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల ఆకస్మిక తనిఖీల్లో వీరి పరిస్థితిని గమనించి ప్రత్యేక దృష్టి పెట్టారు. వీరు అందిస్తోన్న విధులు, ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు.. ఎన్ని రోజులకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించాలి.. ఎలాంటి చికిత్సలు అవసరం తదితర అంశాలపై అధ్యాయనం చేసేందుకు నలుగురు సభ్యులతో ఓ కమిటీని వేశారు. 15 రోజుల్లో నివేదిక వచ్చాక దీనిపై ఓ నిర్ణయం తీసుకుని కార్మికుల కోసం ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలని యోచిస్తున్నారు. ముఖ్యంగా వీరందరి ఆరోగ్య సమాచారాన్ని ఒకచోటకు చేర్చి ఆన్‌లైన్ పోర్టల్ నమోదు చేసేందుకు సైతం ప్రయత్నిస్తున్నారు. ఇది కార్మిక వర్గాలకు సంతోషాన్ని కలిగిస్తోంది. తమ బాధలు, కష్టాలను స్వయంగా గుర్తించి కమిషనర్ ఓ సముచిత నిర్ణయం తీసుకున్నారంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కమిటీ సభ్యులు వీరే..

కార్మికుల ఆరోగ్య భద్రతకు సంబంధించి అదనపు కమిషనర్ నాగనరసింహారావు సమక్షంలో సోమవారం సమావేశమైన కమిషనర్ నలుగురు సభ్యులతో కమిటీని వేశారు. ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, డీఈ మాధవి, ప్రొఫెసర్ డాక్టర్ బి.దేవి మాధురి, సాక్ష్యం సంస్థ ప్రతినిధి డాక్టర్ వెంకటరాజు కమిటీ సభ్యులుగా ఉన్నారు.

కార్మికుల భద్రత మాదే..



ప్రజారోగ్యాన్ని పరిరక్షించడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకం. ఈ క్రమంలో వారు ఎన్నో ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. వీరి ఆరోగ్యాన్ని పరిరక్షించే ఉద్దేశంతోనే ఆ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా కార్యాచరణకు సిద్ధమవుతున్నాం. కాకినాడలో పనిచేసే ప్రతి కార్మికుడి ఆరోగ్య భద్రత కూడా మా బాధ్యతగా భావిస్తున్నాం.

–డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల, కమిషనర్ నగరపాలక సంస్థ